## రాబోయే ఎన్నికల్లో హ్యాట్రిక్ ఖాయం



దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సబ్బండ వర్గాలను ఆదరిస్తున్న బీఆర్ఎస్ రాబోయే ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని జైన్ మైనార్టీ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ రిథేశ్ జాగిర్దార్ అన్నారు. ఆదివారం నవరాత్రి ఉత్సవ్ స్నేహ మిలన్ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు కాలేరు వెంకటేశ్‌ను సన్మానించారు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎంపీ రామచంద్రరాజు, జైన్ సమాజ్ కన్వీనర్ దినేశ్ గోసార్, సురేశ్ గోసార్, యోగేష్ గోసార్ పాల్గొన్నారు. **- సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15**

## 'వేయిపడగలు-ధర్మదృష్టి'

# పుస్తకావిష్కరణ



వేయిపడగలు-ధర్మదృష్టి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కొంక యాదగిరి, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి,బిక్కి కృష్ణ

రవీంద్రభారతి, అక్టోబర్ 15: విమల సాహితి సమితి, ఎన్‌జీవోస్ నెట్ వర్క్ సౌజన్యంతో సుప్రసిద్ధ సాహితీవేత్తలు, విమర్శకుడు, డాక్టర్ ముదిగొండ వీర భద్రయ్య – ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య ఆశీస్సులతో ప్రముఖ సాహితీ పరిశోధకురాలు, రచయిత్రి నాయికోటి విద్యుల్లత రాసిన ' వేయిపడగలు – ధర్మదృష్టి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సభాసామ్రాట్‌గా కళారత్న డా.బిక్కి కృష్ణ సభా అధ్యక్షత వహించిన కార్యక్రమానికి వక్తలుగా సాహితీవేత్త పూర్వ ఇన్‌చార్జి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కొంక యాదగిరి, సుప్రసిద్ధ సాహితీవేత్త బహుగ్రంథకర్త ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి విచ్చేసి పుస్తకావిష్కరణ చేశారు. ప్రొఫెసర్ కొంక యాదగిరి మాట్లాడుతూ.. విశ్వనాథ వేయిపడగల నవలలోని ధర్మదృష్టిని రచయిత్రి నాయికోటి విద్యుల్లత అద్భుతంగా గ్రంథాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. పుస్తకంలోని అనేక కోణాలను డాక్టర్ నాళేశ్వరం శంకరం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి , వైఎస్ శర్మ, డా.జెల్ది విద్యాధరరావు, సముద్రాల శ్రీదేవి, కళారత్న బిక్కి కృష్ణ, డా.రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## ప్రశంసలు అందుకున్న హర్షిత



తిల్లానా ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు మాధవి మారెళ్లపూడి పర్యవేక్షణలో నర్తకి కృష్ణ హర్షిత భరతనాట్యంలో శిక్షణ పొంది.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం తన తొలి ప్రదర్శనలో పలు అంశాలకు తనదైన శైలిలో నర్తించి నృత్య గురువులు ఎస్. జయచంద్రన్, పావని శ్రీలత, కె.కామేశ్వరిల ప్రశంసలు పొందింది.

**- తెలుగు యూనివర్సిటీ**

# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం



జై తెలంగాణ నినాదాలు చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, పార్టీ నాయకులు

అబిడ్స్, అక్టోబర్ 15: తెలంగాణ రాష్ట్ర అవతార పురుషుడు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేయడంతో గోషామహల్‌లోని తన పార్టీ కార్యాలయం వద్ద సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. వ్యాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన పార్టీ మ్యానిఫెస్టోలో అన్ని వర్గాల వారి ప్రాధాన్యత కల్పిస్తూ చేర్చడం జరిగిందని వివరించారు. గత ఎన్నికలో మ్యానిఫెస్టోలో చేర్చక పోయినా పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారని వివరించారు. ఆయా పథకాలు ప్రజాకర్షక పథకాలుగా నిలిచాయన్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ మూడో సారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను తీసుకు వస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో విడుదలతో సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయానికి సీఎం కేసీఆర్ పథకాలు దోహద పడ్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్సీ మల్లేశం

అబిడ్స్, అక్టోబర్ 15: కురుమలు అన్నిరంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. ఆదివారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర సంఘం భవనంలో కురుమ స్కిల్స్, ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్ గీతా గోటి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి యెగ్గె మల్లేశం, ఓయూ చీఫ్ ఎగ్జామినర్ డాక్టర్ ఎం.రాములు, జేఎన్‌టీయూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.యాదయ్య, జంటనగరాల సంఘం అధ్యక్షుడు నర్స వినోద్ కుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్ట మల్లేశం, కె. నర్సింహ, బండారు నారాయణ తదితరులు హాజరై పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్, నగదు ప్రోత్సహకాలను అందజేసి వారిని సన్మానించారు. యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. 10వ తరగతి నుంచి ప్రొఫెషనల్స్ కోర్సుల్లో, పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మరింతంగా ప్రోత్సహించాలనే సంకల్పంతో వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు సివిల్ పరీక్షల్లో రాణించేందుకు గాను వారికి ప్రొఫెసర్ల ద్వారా శిక్షణ ఇచ్చేందుకు కోకాపేటలోని కురుమల ఆత్మగౌరవ భవనంలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. అనంతరం డాక్టర్ రాములు, డాక్టర్ ఎన్. యాదయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కమిటీ ప్రతినిధులు డి. శివకుమార్, ఎన్. విశాల్, డి. శివకుమార్, ఎం. నవీన్ కుమార్, డి. కృపాకర్, ఎ. సాయినాథ్, చిగుమల్ల రాఘవేందర్, శ్రీనివాస్, చీర శ్రీకాంత్, కె. విమల్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వాగ్గేయకారుల సాహిత్యం నేటి తరానికి తెలియాలి



వాగ్గేయకారుల సాహిత్యం నేటి తరానికి తెలియాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. జంటనగరాలకు చెందిన నృత్య గురువులు నెలకొల్పిన సిద్ధ నాట్య కళా సమితి ప్రారంభోత్సవ కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆదివారం సాయంత్రం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కె.వి.రమణాచారి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముత్తుస్వామి దీక్షితార్ రచనలకు నృత్య రూపకల్పన చేసిన అంశాలకు పలువురు కళాకారులు నర్తించారు. నృత్య గురువులు కళాకృష్ణ, డాక్టర్ భాగవతుల సేతురాం, డాక్టర్ ఆర్. ప్రసన్నరాణి, నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. **- తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 15**

## విజ్ఞతకు అబ్దుల్ కలాం స్మారక అవార్డు



అబ్దుల్ కలాం విద్యార్థుల్లో విజ్ఞానాన్ని నింపడానికి ప్రయత్నం చేశారని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పి.ఎస్. నంద అన్నారు. ప్రపంచ విద్యార్థుల దినోత్సవంతో పాటు కలాం జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి పి.ఎస్. నంద పాల్గొన్నారు. ఆమె చేతుల మీదుగా విద్యావేత్త జక్కుల విజ్ఞతకు అబ్దుల్ కలాం స్మారక అవార్డు–2023ను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, ప్రతినిధులు టిఏ మురళీ మోహన్, ఉజ్వల చందర్, కాసమోని శ్యాం రావు, న్యాయవాదులు కుమారి శ్రావణి, కావలి భార్గవి, పొలిశెట్టి అఖిల్ పాల్గొన్నారు. **- అబిడ్స్, అక్టోబర్15**

## కాంగ్రెస్‌లో భగ్గుమన్న విబేధాలు



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పాతనగరం మైనార్టీ నాయకులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. లిస్టులో సంబంధం లేని వ్యక్తులకు టిక్కెట్లు కేటా యించారని పాతనగరంనకు చెందిన పలు నియోజకవర్గ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆది వారం కాంగ్రెస్ తొలి జాబితా విడుదల కావడంతో చాంద్రాయణగుట్ట, బహదూర్‌పుర, యాకుత్‌పుర నియోజకవర్గాల మైనార్టీ నాయకులు తొలి జాబితాలో అన్యాయం జరిగిందని గాంధీభవన్‌కు చేరుకున్నారు. కాగా గాంధీ భవన్‌లో కొనసాగుతున్న మల్లు రవి ప్రెస్ మీట్‌ను అడ్డుకొని తమకు న్యాయం చేయాలని నిరసనను వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడుతూ రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు.

## 100 రోజుల వినూత్న కార్యక్రమం



పండుగల నేపథ్యంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గ్రాండ్ ఫెస్టివల్ 100 రోజుల చాలెంజ్‌తో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు గౌలిగూడలోని హైదరాబాద్ డిపో–1లో డిపో మేనేజర్ కృష్ణారెడ్డి కార్యక్రమాన్ని జెండా ఎగురవేసి ప్రారంభించారు. అక్టోబర్ నుంచి జనవరి వరకు పండుగల నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంటుందన్నారు ఈ నెల 15 నుంచి 2024 జనవరి 22 వరకు అన్ని సర్వీసులతో పాటు 3 శాతం అదనపు బస్సు సర్వీసులని నడిపించాలని, 10 శాతం అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఉద్యోగులను కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ డిపో–1 ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**- సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15**